# గచ్చిబౌలి ప్లాట్ ధర 33 కోట్లు



షార్ప్ న్యూస్ డెస్క్ : గచ్చిబౌలిలోని ఓ కమర్షియల్ స్థలం గజం ధర 2 లక్షల 22 వేల రూపాయలు పలికింది. హైదరాబాద్ పరిధిలోని హౌసింగ్ బోర్డు స్థలాల వేలం ప్రక్రియను నిర్వహించారు. గచ్చిబౌలిలో 4 స్థలాలను వేలం వేయగా, అన్నీ అమ్ముడుపోయాయి. ఆ ప్రాంతంలోని కుక్కలపార్కును ఆనుకుని ఉన్న 1,487 చదరపు గజాల స్థలం వేలంలో ఏకంగా 33 కోట్ల రూపాయలు పలికింది. గచ్చిబౌలిలోని భూముల అమ్మకం ద్వారా 55.56 కోట్ల రూపాయలు వచ్చాయి. కుత్బుల్లాపూర్ మండలం చింతల్‌లో ఎంజీఐ 10 స్థలాలలో 3 అమ్ముడుపోయాయి. వీటి ద్వారా సుమారు 8 కోట్ల ఆదాయం వచ్చింది. బాచుపల్లిలో 8 ప్లాట్లను వేలం వేయగా 4 అమ్ముడుపోయాయి. వేలం ద్వారా ప్రభుత్వానికి 65 కోట్ల రూపాయలు ఆదాయం సమకూరినట్లు హౌసింగ్ బోర్డు కమిషనర్ గౌతమ్ తెలిపారు.

# వైఎస్ జగన్ పై మరో కేసు నమోదు



షార్ప్ న్యూస్ డెస్క్ : ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ పై మరో పోలీసు కేసు నమోదైంది. ఫిబ్రవరి 19న గుంటూరు మిర్చి యార్డులో ఆయన జరిపిన పర్యటనకు సంబంధించి ఈ కేసు దాఖలైంది. అప్పట్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలులో ఉండగా, నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫిబ్రవరి 19న మిర్చి రైతులను పరామర్శించేందుకు జగన్ గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లారు. ఆ సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, వైసీపీ నేతలు ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా యార్డుకు వచ్చారనే ఆరోపణలున్నాయి. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నడిచే ప్రభుత్వ ప్రాంగణమైన మిర్చి యార్డులో జగన్ రాజకీయ ప్రసంగాలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో జగన్‌తో పాటు మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైసీపీ నేతలు లేళ్ల అప్పిరెడ్డి, కావటి మనోహర్‌నాయుడు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి తదితరులపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటన సందర్భంగా సింగయ్య అనే వ్యక్తి మృతి చెందిన ఘటనలోనూ జగన్‌పై కేసు నమోదైంది.

# ఎయిర్ పోర్టు దారిలో అతి చేస్తూ!!



షార్ప్ న్యూస్ డెస్క్ : శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తూ మోటార్‌సైకిల్‌పై అతివేగంగా, నిర్లక్ష్యంగా ప్రయాణించిన ఎనిమిది మందిని సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. రోడ్డులో ఎనిమిది మంది ద్విచక్ర వాహనంపై కూర్చుని అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతున్నారని సమాచారం అందిందన్నారు పోలీసులు. ఇలాంటి పనులు ఇతరుల ప్రాణాలకు, వారి ప్రాణాలకు కూడా ప్రమాదకరమని పోలీసులు తెలిపారు. జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలు భారీగా, వేగంగా ఉన్నాయని ఈ వ్యక్తులు విన్యాసాలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని పోలీసులు తెలిపారు. నిందితులను గుర్తించడానికి ఒక బృందాన్ని పంపామని, వారిని పట్టుకుని %=+×ూ% పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లుగా పోలీసు ఉన్నతాధికారులు వివరించారు.

# ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం



షార్ప్ న్యూస్ డెస్క్ : ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత కొద్ది గంటలుగా ఇరాన్ పలు దఫాలుగా ఇజ్రాయెల్ భూభాగాలపై క్షిపణులతో దాడులు చేసిన నేపథ్యంలో, ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించవద్దని ట్రంప్ ఇరు దేశాలను హెచ్చరించారు. ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా కూడా వెల్లడించింది. క్షిపణి దాడులు ముగియడంతో, ప్రజలు షెల్టర్ల సమీప ప్రాంతాల నుంచి బయటకు రావచ్చని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో జరిపిన చర్చల ద్వారా ట్రంప్ ఈ కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చారని, ఇరాన్ ఇకపై దాడులు చేయనంత కాలం ఇజ్రాయెల్ దీనికి అంగీకరించిందని వైట్‌హౌస్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇరాన్ కూడా కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ధ్రువీకరించింది. ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు అమెరికా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. డొనాల్డ్ ట్రంప్ సూచనల మేరకు కాల్పుల విరమణకు అంగీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ తో అణు ముప్పు తొలగిపోయిందని, ఇరాన్ తో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుంటామని చెప్పారు. తొలుత ఇరాన్ కాల్పుల విరమణను ప్రారంభించింది. దీనికి ప్రతిస్పందనగా, తాము కూడా సీజ్‌ఫైర్‌కు కట్టుబడి ఉంటామని ఇజ్రాయెల్ ప్రకటించింది.

# సీజ్ ఫైర్ ఉల్లంఘన... ఇరాన్ కు ఇజ్రాయెల్ ఘాటు హెచ్చరికలు!

షార్ప్ న్యూస్ డెస్క్ : ఇజ్రాయెల్ %-% ఇరాన్ మధ్య జరుగుతున్న భీకర యుద్ధంలో అత్యంత కీలక పరిణామం తాజాగా చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా.. ఇరు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించాయని ట్రంప్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్, ఇరాన్ దేశాలను తనదైన శైలిలో అభినందించారు. ఈ ఒప్పందానికి కట్టుబడి ఉండాలని సూచించారు. ఈ నేపథ్యంలో.. ఈ ఒప్పందానికి తాము కట్టుబడి ఉన్నట్లు తొలుత ఇరాన్ ప్రకటించింది. ఆ ప్రకటనకు ముందు చివరిగా ఓ ఆరు బాలిస్టిక్ క్షిపణులను టెల్ అవీవ్ పై జారవిడిచినట్లు చెబుతున్నారు. అనంతరం.. ఇజ్రాయెల్ స్పందించింది. కాల్పుల విరమణ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి ఇరాన్ దాడులకు పాల్పడిందని ఇజ్రాయెల్ పేర్కొంది.

అవును... గత 12 రోజులుగా పశ్చిమాసియా రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. ఈ యుద్ధంలో అమెరికా కూడా ఎంట్రీ ఇవ్వడంతో ప్రపంచదేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో.. తాజాగా ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయితే ఈ ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే టెహ్రాన్ దాన్ని ఉల్లంఘించిందని టెల్ అవీవ్ ఆరోపించింది. ఈ సందర్భంగా స్పందించిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్)... కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన రెండు గంటలకే తమ గగనతలం పైకి ఇరాన్ నుంచి బాలిస్టిక్ క్షిపణులు దూసుకొచ్చాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఉత్తర ఇజ్రాయెల్ లో సైరన్ లు కూడా మోగాయని తెలిపింది. ఆయా ప్రాంతాల్లో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని ఆదేశించింది. ఈ విషయాలను 'ఎక్స్' వేదికగా రెగ్యులర్ గా అప్ డేట్ చేస్తుంది. ఇదే సమయంలో... ఈ వ్యవహారంపై ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ స్పందించారు. ఇందులో భాగంగా...



కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన ఇరాన్ పై గట్టిగా స్పందించాలని తాను ఐడీఎఫ్ ను ఆదేశించానని.. టెహ్రాన్ కు అతి ముఖ్యమైన ప్రాంతాలే లక్ష్యంగా దాడులు చేయాలని సూచించానని వెల్లడించారు. అయితే.. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన తర్వాత యూదు దేశంపై ఎటువంటి క్షిపణులను ప్రయోగించలేదని ఇరాన్ రాష్ట్ర మీడియా పేర్కొంది. అయితే.. దీనిపై ఇరాన్ విదేశాంగ శాఖ నుంచి కానీ, రక్షణ శాఖ నుంచి కానీ ఎలాంటి అధికారిక స్పందన రాలేదని తెలుస్తోంది.

# సామాన్యుడి ట్వీట్.. లోకేష్ రియాక్షన్ స్పాట్.. యాక్షన్ స్టార్ట్!



షార్ప్ న్యూస్ డెస్క్ : మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు మారాలి, వారిని పాలించే నేతలూ మారాలి అని అంటారు. ప్రధానంగా ఒకప్పుడు ఒక ఎమ్మెల్యేనో, మంత్రినో నేరుగా కలవాలంటే అదో పెద్ద ప్రహసనం అని చెప్పేవారు. అయితే ఇప్పుడు సోషల్ మీడియా యుగంలో.. సమస్యను నాయకుడికి చెప్పడం పెద్ద విషయం కాదు. కాకపోతే.. వారు ఎప్పటికి రియాక్ట్ అవుతారు అనేది అసలు పాయింట్. ఈ విషయంలో ఏపీ మంత్రి నారా లోకేష్ 100% మార్కులు తెచ్చుకుంటూనే ఉన్నారు! సమస్య ఉందని, సమస్యగా ఉందని ఎక్స్ వేదికగా ఆయన దృష్టికి తీసుకెళ్తే చాలు.. నిమిషాల వ్యవధిలో, గడియారంలో చిన్నముళ్లు అంకె దాటే లోపు రియాక్షన్ వచ్చేస్తోంది. క్యాలెండర్ లో తేదీ మారేలోపు పరిష్కారం కనిపిస్తోంది! ఈ క్రమంలో తాజాగా అలాంటి ఘటనే ఒకటి జరిగింది. అవును... ఈ నెల 23న "యువత పోరు"తో వైసీపీ రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా.. కూటమి నేతలు అధికరంలోకి వచ్చిన తర్వాత యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఇవ్వని పక్షంలో రూ.3,000 నెల నెలా నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని.. అది ఏమాత్రం అమలు చేయలేదని ఆరోపించింది. దీనికి నిరసనగా... ప్రతీ జిల్లా కలెక్టర్ ఆఫీసుల ముందు ధర్నాకు పిలుపునిచ్చింది! అనంతరం కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమం చేసింది. ఈ నేపథ్యంలో... పార్వతీపురం జిల్లా బలిజిపేట మండలం పెద్దపెంకి గ్రామంలోని ఎంపీపీ స్కూల్ విద్యార్థులను ఈ రాజకీయ నిరసనలో పాల్గొనడానికి తీసుకెళ్లారని ఒక సామాన్య వ్యక్తి శ్యామ్ ఎక్స్ వేదికగా మంత్రి లోకేష్ కి విన్నవించారు. ఈ సందర్భంగా... "గౌరవనీయులైన విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ గారికి, పార్వతీపురం మన్యం జిల్లా, పార్వతీపురం నియోజకవర్గం, బలిజిపేట మండలం పెద్దపెంకి గ్రామంలోని ఎంపీపీ స్కూల్ లో జరిగిన ఒక ఆందోళనకర సంఘటన గురించి మీ దృష్టికి తీసుకొస్తున్నాను. నిన్న, స్కూల్ యూనిఫామ్ లో ఉన్న విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే.. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరసనకు తీసుకెళ్లారు" అని తెలిపారు.

అయితే... "షాకింగ్ గా ఎంఈవో, హెడ్ మాస్టర్ ఈ రాజకీయ నిరసనకు విద్యార్థులను అనుమతించారు. తిరిగి వస్తుండగా జరిగిన ఒక దుర్ఘటనలో ఏడుగురు విద్యార్థులు గాయపడి ఆసుపత్రిలో చేరారు. వీరిలో ఇద్దరి పరిస్థితి సీరియస్ గా ఉంది. ఎంఈవో, హెడ్ మాస్టర్ బాధ్యతారహిత ప్రవర్తనపై తీవ్ర ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి" అని పేర్కొన్నారు.

ఈ ట్వీట్ ని సదరు శ్యామ్ అనే వ్యక్తి ఉదయం 11:47 కి పోస్ట్ చేస్తే.. మధ్యాహ్నం 12:40 కల్లా స్పందించిన మంత్రి లోకేష్... "ఇది చాలా దారుణం, నేరం కూడా..! దీనిపై అర్జెంటుగా విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశిస్తున్నాను. గాయపడిన పిల్లలు, తల్లిదండ్రులకు మెరుగైన చికిత్స అందిస్తాం. పాఠశాలల్లో దురదృష్టకరమైన ఈ జోక్యం రాజకీయ పార్టీల నేతలు–అధికారులకు హెచ్చరిక కావాలి" అని స్పందించారు.

ఇదే సమయంలో.. "ఏ రాజకీయ పార్టీ అయినా దయచేసి మీ స్వప్రయోజనాల కోసం పాఠశాలల జోలికి పోవద్దు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు. బాధ్యులపై కఠినంగా వ్యవహరిస్తాం" అని ఎక్స్ వేదికగా రియాక్ట్ అయ్యారు ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్!

# నచ్చిన ఇంటికోసం 20 మంది బాయ్ ఫ్రెండ్స్ ని వాడేసింది.. ఎవరీ యువతి?

షార్ప్ న్యూస్ డెస్క్ : ఓ యువతి తన అవసరాలు తీర్చుకోవడానికి ఏకంగా 20 మంది అబ్బాయిలను ముగ్గులోకి దింపింది. ఒకరికి తెలియకుండా ఒకరికి గర్ల్ ఫ్రెండ్ గా ఉంది. వాళ్లు కూడా ఒకరికి తెలియకుండా ఒకరు ఆమె తనకు మాత్రమే గర్ల్ ఫ్రెండ్ అనుకున్నట్లున్నారు! కట్ చేస్తే.. ఆ 20 మందితోనూ ఒకే రకం గిఫ్ట్ ఇప్పించుకున్న ఆ యువతి, ఆ బహుమతులను అమ్మి, తనకు నచ్చిన ఓ ఇంటిని కొనుగోలు చేసింది. అవును... అవసరం ఎంతటి పనినైనా చూపిస్తుందని అంటారు! అది నిజమే అయినా.. తాజాగా వెలుగులోకి వచ్చిన ఓ ఘటన.. 'కచ్చితంగా నిజమే' అని చెప్పేలా ఉంది. ఈ క్రమంలో చైనాలో ఓ యువతి తనకు నచ్చిన ఇంటిని కొనుగోలు చేయడానికి చేసిన పని ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. ఏమా కథ, ఎవరా యువతి, ఏమా బహుమతులు అనేది ఇప్పుడు చూద్దామ్..! వివరాల్లోకి వెళ్తే... చైనాలోని షెన్జెన్ ప్రాంతానికి చెందిన యువతి షియాలీ తన కలల ఇంటిని కొనాలని బలంగా నిర్ణయించుకుంది. అయితే.. అందుకు ఆమె దగ్గర అంత సొమ్ము లేనట్లుంది! దీంతో.. సదరు చైనా అమ్మాయి 20 బాయ్ ఫ్రెండ్స్ ని



ఏర్పాటు చేసుకుంది. ఒకరికి తెలియకుండా ఒకరితో (ప్రేమ) వ్యవహారం నడిపింది. వారిని ఫుల్ గ్రిప్ లో పెట్టుకున్నట్లుంది! వారంతా ఈ ప్రేమ మైకంలో ఉన్న సమయంలో... 20 మంది బాయ్ ఫ్రెండ్స్ తో ఐఫోన్ లను కొనిపించుకుంది.. బహుమతిగా ఇప్పించుకుంది! ఆ తర్వాత తానుకున్న పనిని మొదలుపెట్టింది. ఇందులో భాగంగా ఆ ఐఫోన్స్ ని బయటి మార్కెట్ లో అమ్మేసింది. ఫలితంగా.. 1,20,000 యువాన్స్ అంటే సుమారు రూ.14 లక్షలు వరకు సంపాదించింది.

ఆ సొమ్ముతో ఇంటిని కొనుక్కుంది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీనిపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పాపం ఆమె పరిస్థితి ఎలాంటిదో అని ఒకరంటే.. ఆమె విలువలు లేని వ్యక్తి అని మరికరు అంటున్నారు. ఇంకొంతమంది మాత్రం ఆమె చాలా టాలెంటెడ్ అని కితాబిస్తున్నారు.

